ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 నంద్యాల
జిల్లా వార్తలు
ఆదివారం 2 జూన్ 2024



హంద్రీనీవా ప్రాజెక్టు మల్యాల పీఎస్-1 ప్రధాన పంప్‌హౌస్



బకాయిలు రూ.4,732.88 కోట్లు

విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయి రూ.4,732.88 కోట్లు. హంద్రీనీవా, గురురాఘవేంద్ర ప్రాజెక్టుతో పాటు ఏపీఎస్ఐడీసీ ఎత్తిపోతల పథకాలు కోసం వినియోగించిన విద్యుత్‌కు జలవనరుల శాఖ ఒక్కటే రూ.3,987.62 కోట్లు చెల్లించాలి. సీఎం జగన్ బాధ్యతలు చేపట్టిన తరువాత ఈ ఐదేళ్లలో ఒక్కపైసా కూడా చెల్లించలేదు. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ఒక్కటే ఆ స్థాయిలో ఉంటే.. రాష్ట్ర వ్యాప్తంగా ఏ స్థాయిలో ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. రూ.వేల కోట్లు బకాయిలు పేరుకుపోవడం వల్ల ఒకటో తేదీనే ఖాతాలో జమ కావాల్సిన వేతనాలు 14, 15వ తేదీల వరకు ఆగాల్సి వస్తుందని ఏపీడీసీఎల్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఆ శాఖ విధించే అపరాధ రుసుంతో ఓ ప్రాజెక్టు నిర్మించవచ్చని సాగునీటి నిపుణులు అంటున్నారు.

- ప్రభుత్వం విద్యుత్ శాఖకు చెల్లించాల్సిన బకాయి
- హంద్రీనీవా ప్రాజెక్టు బకాయి ఒక్కటే రూ.3,602.67 కోట్లు
- ఐదేళ్లలో ఒక్కపైసా ఇవ్వని జగన్ ప్రభుత్వం
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో పేరుకుపోయిన బకాయిలు
- నివేదికలు పంపుతూనే ఉన్న విద్యుత్ శాఖ



కర్నూలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ శాఖకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు గుదిబండగా మారుతున్నాయి. జగన్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పైసా విద్యుత్ బిల్లులు, బకాయిలు చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. రాయలసీమ జిల్లాల్లో కరువు కరువు నివారణ లక్ష్యంగా హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం చేపట్టారు. కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వాలి. శ్రీశైలం ఎగువన నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మాల్యాల నుంచి 40 టీఎంసీలు కృష్ణా వరద జలాలు ఎత్తిపోయాలి. ఫేజ్-1 కింద 216.30 కిలోమీటర్లు ప్రధాన కాలువ, 8 పంపింగ్ స్టేషన్లు నిర్మించారు. 3,850 క్యూసెక్కులు లిఫ్ట్ చేసేందుకు ప్రతి పంపింగ్ స్టేషన్‌లో 12 విద్యుత్తు పంపులు (మోటర్లు) ఏర్పాటు చేశారు. కృష్ణా జలాలు కర్నూలు జిల్లా దాటి అనంతపురం జిల్లాకు చేరాలంటే 8 పంపింగ్ స్టేషన్లు ఏకకాలంలో పని చేయాలి. అలాగే తుంగభద్ర వరద జలాలు ఎత్తిపోసి మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో సాగు, తాగునీరు అందించే లక్ష్యంగా గురురాఘవేంద్ర ప్రాజెక్టులో భాగంగా స్టేజ్-1, స్టేజ్-2 కింద 12 ఎత్తిపోతల పథకాలు, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఐడీసీ) పరిధిలో 79 ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. విద్యుత్ సరఫరా లేకపోతే ఒక్క చుక్క నీరు కూడా ఎత్తిపోయలేని పరిస్థితి ఉంది. గత టీడీపీ ప్రభుత్వంలో కొన్ని నెలలు ఆలస్యమైనా విద్యుత్తు బిల్లులు క్రమం తప్పకుండా చెల్లించేవారు. జగన్ ప్రభుత్వం వచ్చాక కరెంటు బిల్లులకు నిధులు మంజూరు చేయకపోవడం వల్ల బకాయిలు భారీగా పేరుకుపోతున్నాయని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

అన్ని శాఖల్లోనూ ఇదే పరిస్థితి

హంద్రీనీవా ఒక్కటే కాదు.. గురురాఘవేంద్ర ప్రాజెక్టు, ఏపీఎస్ఐడీసీ, గ్రామీణ తాగునీటి విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్), పంచాయతీలు, మున్సిపాలిటీలతో పాటు వివిధ 37 ప్రభుత్వ శాఖ నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఒక్కటే రూ.4,732.88 కోట్లు ప్రభుత్వ విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి అప్పుడప్పుడు బిల్లులు వస్తున్నా.. జలవనరుల శాఖ పర్యవేక్షణలోని ప్రాజెక్టుల నుంచి ఏళ్లు గడుస్తున్న బిల్లులు అందడం లేదు. ఈ క్రమంలో ప్రతి నెల రాష్ట్ర ఉన్నత అధికారులకు నివేదికలు పంపుతామని ట్రాన్స్‌కో అధికారులు పేర్కొంటున్నారు.

గురురాఘవేంద్ర ప్రాజెక్టు మాధవరం ఎత్తిపోతల పథకం





మాల్యాల పంపింగ్ స్టేషన్ నుంచి ఎత్తిపోస్తున్న కృష్ణా జలాలు

విద్యుత్ బకాయిల వివరాలు రూ.కోట్లల్లో

ప్రభుత్వ శాఖ	బకాయి
హంద్రీనీవా ప్రాజెక్టు	3,602.67
గురురాఘవేంద్ర ప్రాజెక్టు	162,20
ఏపీఎస్ఐడీసీ, ఇతర లిఫ్టులు	222.75
ఆర్‌డబ్ల్యూఎస్	168.09
పంచాయతీలు	508.50
మున్సిపాలిటీలు	21.26
ఇతర శాఖలు	47.42
మొత్తం	**4,732.88**



హంద్రీనీవా బకాయి రూ.3,602.67 కోట్లు

హంద్రీనీవా ప్రాజెక్టులో భాగంగా మాల్యాల, బ్రహ్మణకొట్కూరు, సెట్టిపల్లి, కృష్ణగిరి, కంబలపాడు, లక్కసారగం, నునుసురాళ్ల, రాగులపాడు, అంకంపల్లి వద్ద 8 పంపింగ్ స్టేషన్లు నిర్మించారు. 2019-20లో 42 టీఎంసీలు, 2020-21లో 37 టీఎంసీలు, 2021-22లో 26.65 టీఎంసీలు, 2022-23లో 26 టీఎంసీలు, 2023-24లో దాదాపుగా 23 టీఎంసీలు కృష్ణా వరద జలాలు ఎత్తిపోశారు. ఒక టీఎంసీ నీటిని ఎత్తిపోసేందుకు సుమారుగా రూ.23-25 కోట్లు విలువైన విద్యుత్ ఖర్చు అవుతుంది. ఈ ఏడాది చిత్తూరు జిల్లా కుప్పానికి తీసుకెళ్లామని సీఎం జగన్ గొప్పగా చెప్పుకున్నారు. వైసీపీ ప్రభుత్వం కొలువుదీరాక విద్యుత్ బిల్లు చెల్లింపు కోసం నిధులు మంజూరు చేయలేదు. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.670.01 కోట్లు, 2020-21లో 834.80 కోట్లు, 2021-22లో 821.39 కోట్లు, 2022-23, 2023-24 రెండేళ్లలో 1,276.34 కోట్లు కలిపి ఐదేళ్లలో రూ.3,602.67 కోట్లు విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయి. సకాలంలో బిల్లులు ఇవ్వకపోవడంతో దాదాపు రూ.100-150 కోట్లు అపరాధ రుసుం చెల్లించాలని అంచనా. ప్రభుత్వం విద్యుత్ బకాయిలు చెల్లించకపోవడంతో అదే స్థాయిలో డిస్కమ్స్ కూడా ఎన్‌టీపీసీ వంటి విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు రూ.వేల కోట్లు బకాయిలు పెట్టాల్సి వచ్చిందని ట్రాన్స్‌కో ఇంజనీర్లు అంటున్నారు. ఉగ్యోగులకు 14,15వ తేదీల వరకు జీతాలు అందని పరిస్థితి ఏర్పడింది. తన 30 ఏళ్ల సర్వీస్‌లో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని, టాన్స్‌కో చరిత్రలోనే ఆ దుస్థితి లేదని ఏపీ ట్రాన్స్‌కో ఇంజనీరు ఒకరు పేర్కొనడం కొసమెరుపు.

ప్రభుత్వ బకాయిలు వాస్తవమే

హంద్రీనీవా, గురురాఘవేంద్ర ప్రాజెక్టు సహా వివిధ శాఖలు నుంచి విద్యుత్ బిల్లులు రూ.4,732.88 కోట్లు బకాయి ఉన్నమాట నిజమే. ప్రతి నెల బకాయిలపై ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. అలాగే బకాయి ఉన్న ఆయా శాఖలకు నోటీసులు కూడా జారీ చేశాం.

- ఉమాపతి, విద్యుత్ శాఖ ఎస్ఈ, కర్నూలు

శిరివెళ్ల: వెంకటాపురంలో పూజలందుకున్న ఆంజనేయస్వామి



అంజనీపుత్రా.. అభయప్రదాతా...

నంద్యాల (కల్చరల్), జూన్ 1: హనుమజ్జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా శనివారం ఘనంగా జరిగాయి. జై హనుమాన్, జై శ్రీరామ్ నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. అంజనీపుత్రుని దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆకుపూజ, అలంకరణలు జరిగాయి. అభిషేకాలతో పూజలు ప్రారంభమయ్యాయి. వేద, సుందరకాండ, మన్యుసూక్త హోమాలు, శ్రీరామ ఆంజనేయ మూలమంత్ర జపాలు, హోమం, శ్రీరామ పట్టాభిషేకం, బలిహరణ, పూర్ణాహుతి, కలశోద్వాసన, అవభృద కార్యక్రమాలు నిర్వహించారు. నంద్యాల పట్టణంలోని బైటిపేట ఆంజనేయ కోదండ రామస్వామి, సంజీవనగర్ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆంజనేయ స్వామికి అభిషేకాలు, అర్చనలు, ఆకుపూజలు చేపట్టారు. మహిళలు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అదేవిధంగా కర్నూలు నగరంలోని జగన్నాథ గట్టు, ఈ.తాండ్రపాడులోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. బళ్లారి చౌరస్తాలోని వీరాంజనేయ స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గుత్తిరోడ్‌లోని సూర్యభగవానుడి ఆలయంలో అంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు.



సంజీవనగర్ రామాలయంలో ప్రత్యేకంగా అలంకరించిన ఆంజనేయ స్వామి



ఉయ్యాలవాడలో..

అభ్యర్థుల్లో టెన్షన్

- హ్యాట్రిక్‌పై వైసీపీ ఆశలు
- ఈ సారి గెలుపు మాదే అంటున్న టీడీపీ
- 20 ఏళ్ల చరిత్రను తిరగ రాస్తామని ఉద్ఘాటన
- పైకి ధీమా.. లోపల అంతర్మథనం
- గుబులు రేపుతున్న నిశబ్ద ఓటు



గిత్తా జయసూర్య



ధారా సుధీర్

నందికొట్కూరు, జూన్ 1: ఓట్ల లెక్కింపు సమయం దగ్గర పడే కొద్దీ అభ్యర్థుల్లో టెన్షన్ పెరుగుతోంది. గెలుపుపై ఎవరి లెక్కలు వారికి ఉన్నా లోపల మాత్రం ఆందోళన తప్పడం లేదని తెలుస్తోంది. హ్యాట్రిక్ కొట్టి తీరుతామని వైసీపీ భావిస్తుండగా ఈ సారి గెలుపు తమదేనని, 20 ఏళ్ల చరిత్రను తిరగ రాస్తామని టీడీపీ బలంగా చెబుతోంది. వైసీపీ, టీడీపీలు పైకి ఇంత ధీమాగా ఉన్నా లోపల మాత్రం అంతర్మథనం చెందుతున్నట్టు తెలుస్తోంది. నిశబ్ద ఓటు ఎవరికి అనుకూలమనేది అర్థంగాక అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది.

రాష్ట్రంలో ఏ సీటు గెలవకపోయినా నందికొట్కూరులో కచ్చితంగా గెలుస్తామన్న ధీమా ఆ పార్టీ అధినేతకు ఉండేది. అందుకే ఆయన గెలిచే స్థానం కదా అని ప్రచారానికి కూడా రాలేదని తెలిసింది. అయితే పోలింగ్ అనంతరం అధికార పార్టీ లెక్కలు తారుమారయ్యాయన్న అనుమానాలు ఆ పార్టీ నాయకుల్లోనే మొదలయ్యాయి. విజయం నల్లేరుపై నడక అనుకున్న వైసీపీకి గెలుపుపై అంతర్మథనం మొదలైంది. లోలోన ఓడిపోతామన్న భయం ఉన్నా పైకి మాత్రం అధికార పార్టీ నాయకులు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇదే తరుణంలో గత 20 ఏళ్లుగా అధికారానికి దూరమైన టీడీపీ ఈ సారి ఎలాగైనా నందుల కోటలో టీడీపీ జెండాను ఎగురవేస్తామన్న ధీమాను వ్యక్తం చేస్తోంది.



84.79 శాతం పోలింగ్ నమోదు: 2019లో జరిగిన ఎన్నికల్లో 1,97,720 మంది ఓటర్లు ఉండగా 1,72,720 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే 2024లో మాత్రం నియోజకవర్గంలో 2,360 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నాయి. నియోజకవర్గంలో మొత్తం 251 పోలింగ్ కేంద్రాల్లో 2,18,047 మంది ఓటర్లు ఉండగా అందులో 1,06,689 మంది పురుషులు, 1,11,340 మంది స్త్రీలు, 18 మంది ఇతరులు ఉన్నారు. అందులో పురుషులు 91,934, స్త్రీలు 92,940, ఇతరులు 12, మొత్తం 1,84,886 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2019 కంటే ఈ సారి మూడు శాతం మేర పోలింగ్ తక్కువగా నమోదైంది.

గుబులు రేపుతున్న నిశబ్ద విప్లవం : నిశబ్ద ఓటు అధికార, ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల్లో గుబులు రేపుతోంది. బూత్‌ల వారీగా ఆయా పార్టీలకు పడిన ఓట్లను బేరీజు వేసుకుంటూ గెలుపుపై ఎవరి ధీమాను వారు వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ నాయకులు 2019 ఎన్నికల్లో కష్టపడినట్లుగా 2024 ఎన్నికల్లో పని చేయలేదని ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలో అధికార పార్టీ దాదాపు రూ.40 కోట్ల వరకు ఈ ఎన్నికల్లో ఖర్చు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే నిశబ్ద విప్లవం దేనికి దారి తీస్తుందోనన్న భయాందోళనలు ప్రధాన పార్టీల్లో మొదలయ్యాయి.

పోస్టల్ బ్యాలెట్‌తోనే మార్పు: ఉద్యోగులు వేసిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మార్పునకు నాంది పలికాయని పలువురు చర్చించుకుంటున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతోనే సామాన్య ఓటర్లో కూడా చైతన్యం వచ్చిందంటున్నారు. దీంతో పల్లెలతోపాటు పట్టణంలో కూడా భారీగా మార్పులు చోటు చేసుకున్నాయి. పోలింగ్ రోజున ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద పోటెత్తారు. దీంతో అధికార పార్టీకి పట్టం కట్టేందుకే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారా లేక మార్పు కోసం క్యూ కట్టారా అన్న సందిగ్ధంలో అధికార ప్రతిపక్ష పార్టీలు పడ్డాయి.

జోరుగా బెట్టింగ్: నందికొట్కూరు నియోజకవర్గంలో కౌంటింగ్ ప్రక్రియ దగ్గర పడుతున్న కొద్ది బెట్టింగ్‌లు జోరందుకుంటున్నాయి. ఇప్పటి వరకు బెట్టింగ్ రూ.6 కోట్ల వరకు చేరుకుందన్న ప్రచారం జరుగుతోంది. ఇందులో ఆయా పార్టీల ప్రధాన నాయకులే బెట్టింగ్ వేసినట్టు తెలుస్తోంది.

శారీరక రుగ్మతల వల్లే సైకో సోమాటిక్ వ్యాధులు



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డా.రాధికారెడ్డి

- డా.వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ రిజిస్ట్రార్ రాధికరెడ్డి
- కర్నూలులో ప్రారంభమైన దక్షిణ భారత మానసిక వైద్యుల సదస్సు

కర్నూలు(హాస్పిటల్), జూన్ 1: మానసిక ఒత్తిడితో శరీరంలో మార్పులు, శారీరక జబ్బుల వల్ల మానసిక సమస్యల వల్ల సైకో సోమాటిక్ వ్యాధులు ఎక్కువవుతున్నాయని డా.వైఎస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ రిజిస్ట్రార్ డా.వి.రాధికారెడ్డి అన్నారు. శనివారం కర్నూలు నగరంలోని మౌర్యాఇన్ హోటల్‌లో రెండు రోజుల దక్షిణ భారత మానసిక వైద్యుల సదస్సును రిజిస్ట్రార్ డా.రాధికా రెడ్డి, కర్నూలు ఎంపీ డా.సంజీవకుమార్‌తో ప్రారంభించారు. ఈ సందర్భంగా డా.రాధికారెడ్డి మాట్లాడుతూ సైకో-సోమాటిక్ వ్యాధులు మహిళల్లో ఎక్కువగా వస్తున్నాయని అన్నారు. హార్మోన్ల ఇన్ బ్యాలెన్స్ వల్ల ఈ వ్యాధులు వస్తున్నాయని తెలిపారు. ఈ వ్యాధిని గుర్తించి త్వరగా వైద్యం అందించాలన్నారు. కర్నూలు ఎంపీ డా.సంజీవకుమార్ మాట్లాడుతూ జీజీహెచ్‌లో సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో 19 పీజీ సీట్లు, 179 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టులు రావడానికి కృషి చేశానన్నారు. ప్రజలకు తక్కువ ధరలో జన ఔషధి స్కీమ్‌ను జిల్లాలో గ్రామ స్థాయిలో పెట్టించాలని ప్రయత్నం చేసినా ప్రభుత్వం సహకరించలేదన్నారు. కార్యక్రమంలో సౌత్‌జోన్ సదస్సులో సౌత్ ఇండియా అధ్యక్షుడు డా.అభయ్ మట్కర్, వైస్ ప్రెసిడెంట్ ఉమాశంకర్, కార్యదర్శి డా.లోకేశ్వరరెడ్డి, సీఎంఈ చైర్‌పర్సన్ పీఎస్‌వీఎన్ శర్మ, ఏపీఎంసీ అబ్జర్వర్ డా.ఇండ్ల రామసుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ చైర్మన్ డా.బి.రమేష్‌బాబు, సెక్రటరీ డా.కే నాగిరెడ్డి, ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రటరీలు డా.హరిప్రసాద్, డా.సుహృత్ రెడ్డి, సైంటిఫిక్ కన్వీనర్ డా.శివశంకర్ రెడ్డి, కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు, కేరళ, ఏపీ రాష్ట్రాల నుంచి వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంజీవకుమార్



సదస్సుకు హాజరైన వైద్యులు

మూగజీవాల ఎరువే పంటకు ప్రాణం

వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 1: నేరసారం పెంచేందుకు మూగ జీవాల ఎరువు ఎంతగానో ఉపయోగపడుతుందని, గొర్రెలు, మేకలు, కోళ్లు, కంపోస్టు, సేంద్రియ ఎరువులు పంటలకు ప్రాణప్రదమని జిల్లా వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి స్పష్టం చేశారు. గొర్రెలు, మేకల మూత్రంలో పీహెచ్ విలువ 7.7 ఉంటుందని, దీని ద్వారా చౌడుభూములు సారవంతమవుతాయని అన్నారు. ఒక లీటరు మూత్రంలో 3 నుంచి 13 గ్రాముల నత్రజని, 18 నుంచి 20 గ్రాముల పొటాషియం, ఫాస్ఫరస్ మొదలైన మూలకాలు ఉంటాయని జేడీ తెలిపారు. ఒక గొర్రె ద్వారా ఒక రాత్రికి లీటరు మూత్రం 360 నుంచి 540 గ్రాముల పేడ లభిస్తుందని, మేకలు 900 గ్రాముల వరకు పేడను విసర్జిస్తాయని, వీటి ద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్‌తో పాటు బ్యాక్టీరియా ప్రోటోజోవా ఫంగీ మొదలైన ఉపయోగకరమైన సూక్ష్మజీవులు ఉత్పత్తయి నేల సారవంతమవుతుందని జేడీ వివరించారు. జీవాల మందను పొలాల్లో కూర్చోబెట్టడం ద్వారా రసాయనక ఎరువుల వినియోగం అవసరం ఉండదని, పంట పూర్తయ్యాక నెల రోజుల పాటు గొర్రెల మందను పొలంలోనే ఉంచడం వల్ల రైతుకు రూ.10 నుంచి 15వేల దాకా ఖర్చు తగ్గుతుందన్నారు.

రబీ పంట నష్టం రూ.58.28 కోట్లు

- 57వేల హెక్టార్లలో పంటలు మట్టిపాలు
- ప్రభుత్వానికి నివేదిక

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 1: ఈ సంవత్సరం రబీ సీజన్‌లో అనావృష్టి వల్ల కర్నూలు జిల్లాలో 18 మండలాల్లో సాగు చేసిన 57,677.62 హెక్టార్లలో సాగైన పంటలు మట్టిపాలయ్యాయి. వీటికి సంబంధించి ప్రాథమిక నివేదికను వ్యవసాయ శాఖ అధికారులు సర్వే చేసి రూ.71వేల కోట్ల పంట నష్టం జరిగినట్లు ప్రభుత్వానికి నివేదికను అందజేశామని చెబుతున్నారు. అయితే ఫైనల్‌గా మళ్లీ సర్వే చేసి ఎంత నష్టం జరిగిందో సర్వే చేసి తుది లిస్టును తయారు చేయాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారన్నారు. ఇందులో భాగంగానే తుది జాబితాలో 54,382 మంది రైతులు పంట నష్టానికి గురయ్యారనీ, వీరికి 57,677.62 హెక్టార్లలో సాగైన పంటలు నష్టపోయినట్లు గుర్తించి వారికి రూ.58.28 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాల్సి ఉందని ప్రభుత్వానికి నివేధికను కలెక్టర్ అనుమతితో పంపనున్నట్లు జేడీ వరలక్ష్మి తెలిపారు. ఆదోని, కోడుమూరు, ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి, గూడూరు, హొళగుంద, కోడుమూరు, కల్లూరు, మద్దికెర, ఓర్వకల్లు, మంత్రాలయం, వెల్దుర్తి, కర్నూలు రూరల్, అర్బన్ మండలాల రైతులు నష్టపోయారనీ, ప్రభుత్వం త్వరలో ఇన్‌పుట్ సబ్సిడీని నష్టపోయిన రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేయడం జరుగుతుందని జేడీ తెలిపారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 1: జిల్లాలో ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో పదవ తరగతి విద్యార్థులు మొత్తం 331 మంది, ఇంటర్ విద్యార్థులు 347 మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఇందులో పది పరీక్షలకు 291 మంది విద్యార్థులు హాజరు కాగా, 40 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్మీడియట్ పరీక్షలకు 308 మంది విద్యార్థులు హాజరు కాగా, 39 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలను డీఈఓ శామ్యూల్ పర్యవేక్షించారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం



మాట్లాడుతున్న ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మీర్ తారీఖ్ ఆలి

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 1: సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్‌కు సర్వం సిద్ధం చేశామని సాధారణ ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మీర్ తారీఖ్ ఆలి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ నిర్వహణపై ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల జనరల్ అబ్జర్వర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలకు సంబంధించి జూన్ 4న వెలువడనున్న ఫలితాల నేపథ్యంలో కౌంటిగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ రిటర్నింగ్ అధికారులతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం ఇవ్వకూడదన్నారు. గత వైఫల్యాలు ఏమైనా జరిగి ఉంటే పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఆదోని ఆర్వో, సబ్ కలెక్టర్ శివ్ నారాయణశర్మ, పత్తికొండ ఆర్వో రామలక్ష్మి, ఆలూరు ఆర్వో రాము నాయక్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



కలెక్టర్‌కు బొకే ఇస్తున్న ప్రభాకర్ రెడ్డి

కర్నూలు (హాస్పిటల్), జూన్ 1: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన డా.సి.ప్రభాకర్ రెడ్డి శనివారం ఉదయం కలెక్టర్ డా.జి.సృజనను కలెక్టర్ చాంబరులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆసుపత్రి విషయాలపై ఇరువురు చర్చించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు డా.ప్రభాకర్ రెడ్డికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ ఉన్నారు.

క్యాజువాల్టీ, ఏఎంసీకే తొలి ప్రాధాన్యం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి

- వైద్యులు సమయపాలన పాటించాల్సిందే
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 1: అత్యవసర రోగులకు వైద్యం అందించే క్యాజువాల్టీ, ఏఎంసీ వార్డులకే అధిక ప్రాధాన్యం ఇస్తామని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన డీఎంహెచ్‌వో డా.ప్రవీణ్ కుమార్, ఆర్ఎంవో వెంకటరమణతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేయాలని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పెట్టిన క్యాజువాల్టీ (అత్యవసర విభాగం) అలాగే ఉందని, దీన్ని మార్పులు చేస్తామని చెప్పారు. క్యాజువాల్టీ పక్కన ఉన్న ఔషధాల క్యాజువాల్టీలో బ్రెయిన్ స్ట్రోక్, హార్ట్‌ఎటాక్ రోగులకు వైద్యం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇక ఏఎంసీ పక్కన ఉన్న మానసిక వ్యాధుల విభాగం ఓపీ కేంద్రంలో అదనపు ఏఎంసీని ఏర్పాటు చేసి ఐసీయూ పడకలను ఉంచుతామని వెల్లడించారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

కలెక్టర్ శ్రీనివాసులు, ఎస్పీ రఘువీర్ రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

నంద్యాల కల్చరల్/నంద్యాల క్రైం, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా ఎన్నికల అధికారి/ కలెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహిం చేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. నంద్యాల పట్టణ శివారు ప్రాంతంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కాలేజీలో నందికొట్కూరు, శ్రీశైలం అసెంబ్లీ నియోజకవర్గాలు, శాంతిరాం ఇంజనీరింగ్ కాలేజీలో నంద్యాల, ఆళ్లగడ్డ, బనగానపల్లి, అసెంబ్లీ నియోజకవర్గాలు, ఫార్మసీ కాలేజీలో డోన్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈనెల 4వతేదీ ఉదయం 8గంటలకు పోస్టల్‌బ్యాలెట్ లెక్కింపు అనంతరం అరగంటకు ఈవీఎంల ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ తెలిపారు.

అప్రమత్తంగా వ్యవహరించాలి : ఎస్పీ

రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీచేసిన అభ్యర్థులు, ఏజెంట్లు ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి సూచించారు. కౌంటింగ్ కేంద్రాలవద్ద 144వ సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని పేర్కొన్నారు. కౌంటింగ్‌రోజు కళాశాల ప్రవేశద్వారం వద్ద విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది కళాశాల లోపలికి వచ్చే ప్రతి ఒక్కరిని తనిఖీ చేస్తారన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత విజయోత్సవర్యాలీలకు అనుమతి లేదన్నారు. ఆర్జీఎం హాస్టల్ క్యాంపస్ ఆవరణలో కౌంటింగ్ కేంద్రాలకు హాజరయ్యే అధికారులు, సిబ్బంది, మీడియా ప్రతినిధులకు చెందిన వాహనాలు మాత్రమే అనుమతిస్తామని ఎస్పీ వెల్లడించారు. కేశవరెడ్డి స్కూల్ ఆవరణలో శ్రీశైలం, నంద్యాల, ఆళ్లగడ్డ, నందికొట్కూరు నియోజకవర్గాలకు సంబంధించిన వారి వాహనాలు పార్టీలవారీగా నిర్దేశించిన ప్రదేశంలో మాత్రమే పార్కింగ్ చేసుకోవాలని ఎస్పీ సూచించారు. అలాగే బీసీ వెల్ఫేర్ స్కూల్ ఆవరణలో డోన్, బనగానపల్లె నియోజకవర్గాలకు చెందిన తెలుగుదేశం పార్టీకి సంబంధించిన వాహనాలు పార్కింగ్ చేసుకోవాలన్నారు. ఎస్టీ వెల్ఫేర్ స్కూల్ ఆవరణలో డోన్, బనగానపల్లె నియోజకవర్గాల వైసీపీకి సంబంధించిన వాహనాలు పార్కింగ్ చేసుకోవాలని తెలిపారు.

కౌంటింగ్ సూపర్‌వైజర్స్, అసిస్టెంట్లకు శిక్షణ



సూచనలు ఇస్తున్న కలెక్టర్ జి.సృజన

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 1: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ నిర్వహణపై శనివారం కౌంటింగ్ సూపర్‌వైజర్స్, కౌంటింగ్ అసిస్టెం ట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజన మాట్లాడుతూ కౌంటింగ్ నియమ నిబంధనల గురించి క్షుణ్ణంగా తెలుసుకోవాలని అన్నారు. మొబైల్ ఫోన్లు, కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి లేదన్నారు. ఒకవేళ తీసుకుని వస్తే అక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్స్ వద్దే వాటిని డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ప్రతి ఈవీఎం కౌంటింగ్ హాల్లో 14 టేబుల్స్ ఉంటాయని, పోటీల్లో ఉన్న అభ్యర్థుల సంఖ్యను బట్టి కౌంటింగ్ సమయంలో తేడా ఉంటుందన్నారు. రౌండ్ల వారీగా ప్రతి రౌండు పోల్ వివరాలను గట్టిగా ఏజెంట్లకు వినపడేలా అభ్యర్థుల వారిగా చదవాలన్నారు. కౌంటింగ్ సమయంలో కంట్రోల్ యూనిట్ ఆన్ చేసినప్పుడు డిస్‌ప్లే రాకపోతే ఆర్వోకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఒకవేళ 17సీ, ఈవీఎంలో ఉన్న ఓట్లకు వ్యత్యాసం ఉంటే సంబంధిత ఆర్వోకు తెలపాలన్నారు. రౌండ్ల వారీగా సంతకం లేకపోతే కౌంటింగ్ కోసం రెండో మిషన్ ఇవ్వడం జరగదన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌కు ముందు బ్యాలెట్ ఔటర్ కవర్ ఓపెన్ చేసినప్పుడు డిక్లరేషన్, బ్యాలెట్ ఉందా లేదా అని చెక్ చేయాలన్నారు. ఒకవేళ డిక్లరేషన్ లేకపోతే ఇన్‌వాలిడ్ అని, డిక్లరేషన్ ఉండి అందులో ఓటరు సంతకం ఉంటే వ్యాలిడ్ అని తెలిపారు. ఒక వేళ ఓటరు సంతకం లేకపోతే ఇన్‌వాలిడ్‌గా పరిగణించబడుతుందన్నారు. తర్వాత గెజిటెడ్ అధికారి సీల్, సంతకం ఉందా లేదా అని చెక్ చేసుకోవాలన్నారు. డమ్మీ పోస్టల్ బ్యాలెట్‌లను ప్రదర్శించి ఏది వ్యాలిడ్, ఏది ఇన్ వ్యాలిడ్ అని అవగాహన కల్పించారు. సమావేశంలో డీఆర్వో మధుసూదన్‌రావు, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారులు సోమశేఖర్ రెడ్డి, మారుతి ప్రసాద్, సిద్దలింగమూర్తి, పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సలీంబాషా, కౌంటింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

నలుగురి దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు
- పెళ్లికి వచ్చి వెళ్తుండగా ప్రమాదం
- అంతా ఒక కుటుంబానికి చెందిన వారే..

ఆళ్లగడ్డ, జూన్ 1: ఆగి ఉన్న లారీని కారు ఢీకొని ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా యర్రవల్లి వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. ఆళ్లగడ్డ పట్టణంలోని పుల్లారెడ్డి వీధికి చెందిన వెంకటేశ్వర్లు హైదరాబాదులో స్థిరపడ్డాడు. ఆళ్లగడ్డలో గత నెల 27, 28 తేదీలలో తన భార్య ఓబులమ్మ తమ్ముడి పెళ్లికి హాజరై తిరిగి హైదరాబాదుకు బయలుదేరారు. వీరు పయనిస్తున్న కారు యర్రవల్లి సమీపంలోకి రాగానే అక్కడే ఆగి ఉన్న లారీని ఢీకొంది. దీంతో వెంకటేశ్వర్లు (38), అతని భార్య ఓబులమ్మ (35), తల్లి లత(55), అక్క కొడుకు(8)ఆదిత్య దుర్మణం చెందారు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు అక్క కవిత, కొడుకు నందు, కూతురు ధరణిలు గాయపడ్డారు. వీరిని పోలీసులు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం కేసు నమోదు చేశారు. మృతదేహాలకు కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో శవపరీక్ష నిర్వహించిన అనంతరం శనివారం ఆళ్లగడ్డకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో ఆళ్లగడ్డ పట్టణంలోని పుల్లారెడ్డి వీధిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పెళ్లి పందిర్లు తొలగించక ముందే ఆ ఇంట ఎంత ఘోరం జరిగిందంటూ పలువురు విచారం వ్యక్తం చేశారు.

తెలంగాణ మద్యం సీజ్

కర్నూలు(అర్బన్), జూన్ 1: తెలంగాణ నుంచి అక్రమంగా జిల్లాలోకి తరలిస్తున్న 1,936 మద్యం బాటిళ్లను సీజ్ చేశామని సెబ్ సీఐ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శనివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో జిల్లాలోని అక్రమ మద్యం, నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. అక్రమ మద్యం తరలిస్తున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని ఆరు కేసులు నమోదు చేశామన్నారు. నాటు సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 900 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామని తెలిపారు. 23 లీటర్ల సాటు సారాను స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు.



టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం

- టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిదే విజయం
- అంచనాలు వేసిన మెజార్టీ సర్వే సంస్థలు
- జిల్లాలోనూ సత్తా చాటనున్న తెలుగుదేశం

కర్నూలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మే 13న ఓటర్లు తీర్పు ఇచ్చారు. అభ్యర్థుల భవిషత్తు ఈవీఎం యంత్రాల్లో నిక్షిప్తమై మూడంచెల భద్రత వలయంలో స్ట్రాంగ్ రూంల్లో భద్రంగా ఉన్నాయి. ఇప్పటి వరకు అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీ నాయకులు అంచనాలతో కుస్తీపట్టారు. పోలింగ్ కేంద్రాల వారీగాపోలైన ఓటర్ల వివరాలు తెప్పించి లెక్కలేసి మాదే గెలుపు అంటూ టీడీపీ, వైసీపీ అభ్యర్థులు ధీమా వ్యక్తం చేశారు. నేటి నుంచి నాలుగవ రోజు అంటే మంగళవారం మధ్యాహ్నం 12 గంటల్లోగా విజేత ఎవరు..? పరాజితులు ఎవరు..? తేలిపోనుంది. శనివారం సాయంత్రం ఆరు గంటల తరువాత వివిధ సంస్థలు వెల్లడించిన ఎగ్జిట్ పోల్స్ బరిలో ఉన్న అభ్యర్థులు, ఆయా రాజకీయ పార్టీల ముఖ్యనాయకుల్లో ఉత్కంఠకు తెర తీశాయి. పదుల సంఖ్యలో సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశాయి. రాష్ట్రంలో ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందో..? ఏ పార్టీకి ఎన్ని అసెంబ్లీ స్థానాల్లో గెలవబోతుందో..? ఎన్ని పార్లమెంట్ స్థానాల్లో గెలువబోతుందో..? అంచనాలు వేసి ఎగ్జిట్ పోల్స్ ప్రజల ముందు ఉంచారు. మెజార్టీ సర్వే సంస్థలు, మీడియా సంస్థలు టీడీపీ సారథ్యంలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నట్లు ప్రకటించాయి. ఇది టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. ఇవి ఎగ్జిట్ పోల్స్ కాదు.. ఎగ్జాట్ పోల్స్. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయడం తథ్యం అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తినబోయే ముందు రుచి ఎందుకు.. జూన్ 4న కూటమికి అనుకూలంగా ప్రజల తీర్పు రాబోతుందని ఆయన అన్నారు. అదే క్రమంలో కొన్ని సంస్థలు మళ్లీ వైసీపీనే ప్రభుత్వం ఏర్పాటు చేయబోతుందని వెల్లడించడంతో ఆ పార్టీ శ్రేణుల్లో కొంత ఉత్సాహం కనిపించింది.

మెజార్టీ స్థానాలు టీడీపీకే..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో నంద్యాల, కర్నూలు పార్లమెంట్ స్థానాలతో పాటు 14 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 1994, 1999 ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకొని సత్తా చాటిన టీడీపీ ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో 3-4 సీట్లకే పరిమితమైంది. 2019 ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ఓటమి చవి చూసింది. క్లీన్‌స్వీప్ విజయం అందించినా జగన్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి శూన్యం. ప్రజలు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. అదే క్రమంలో ఉద్యోగులు ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మే 13న జరిగిన ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు టీడీపీ కూటమికి అనుకూలంగా మారింది. జిల్లాలో రికార్డు స్థాయిలో 76.42 శాతం పోలింగ్ నమోదైంది. దీంతో టీడీపీ సత్తా చాటి 1999 నాటి విజయాన్ని సొంతం చేసుకుంటామని టీడీపీ శ్రేణులు ధీమాతో ఉన్నారు. సర్వే సంస్థల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 6-8 స్థానాల్లో టీడీపీ కూటమి విజయం సాధిస్తుందని అంచనాలు వేస్తున్నాయి. మెజార్టీ స్థానాలు టీడీపీ కైవసం చేసుకుంటుందని ఆ పార్టీ నాయకులు అంటున్నారు. అయితే.. ఉమ్మడి జిల్లాలో పది స్థానాలకు పైగా విజయం సాధిస్తామని, కొన్ని ఎగ్జిట్ పోల్స్ సర్వే సంస్థలు అదే విషయం వెల్లడిస్తున్నాయని వైసీపీ నాయకులు పేర్కొనడం కొసమెరుపు.

రాయలసీమ అభివృద్ధిపై దృష్టి సారించాలి

రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి



నంద్యాల టౌన్, జూన్ 1: రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరే ప్రభుత్వం రాయలసీమ అభివృద్ధిపై దృష్టి సారించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి కోరారు. రాయలసీమ ప్రాంత ప్రజల ఆశలు, ఆకాంక్షలను నూతన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి శనివారం ఈ-మెయిల్ ద్వారా లేఖను పంపారు. ఈ సందర్భంగా బొజ్జా మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలోని రాయలసీమ హక్కులను ఇన్నేళ్లయినా అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది అక్టోబరు 4న విడుదల చేసిన గెజిట్ వల్ల రాయలసీమ సాగునీటి హక్కులకు తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. ఈ నెల 10వ తేదీన సంగమేశ్వరంలో సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన 8వ వార్షికోత్సవంలో రాయలసీమ ప్రజా సంఘాలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించబోతున్నట్లు తెలిపారు.

డిగ్రీలో 26 మంది డిబార్

కర్నూలు(అర్బన్), జూన్ 1: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 2, 6 సెమిస్టర్ పరీక్షల్లో 26 మంది విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం కర్నూలు, నంద్యాల జిల్లాలోని 64 పరీక్షా కేంద్రాల్లో 2వ సెమిస్టర్‌కు 2,787కు 2,536, 6వ సెమిస్టర్‌కు 423 మంది దరఖాస్తు చేసుకోగా 383 మంది హాజరై పరీక్షలు రాశారు.

ఘనంగా హనుమజ్జయంతి

• భక్తులతో కిటకిటలాడిన ఆంజనేయస్వామి ఆలయాలు • ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు • భక్తులకు అన్నదానం


నంద్యాలలోని సంజీవనగర్ రామాలయంలో స్వామికి తేనెతో అభిషేకం చేస్తున్న భక్తులు


పీరుసాహెబ్ పేటలో వేడుకల్లో పాల్గొన్న భక్తులు


నందికొట్కూరులోని ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య

నంద్యాల (కల్చరల్), జూన్ 1: నంద్యాలలోని పలు ఆలయాలలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బైటిపేటలోని శ్రీఆంజనేయకోదండరామస్వామి దేవస్థానంలో ఈవో రామంజనేయ శర్మ, సంజీవనగర్ రామాలయంలలో భగవత్‌సేవాసమాజ్ కమిటీ, కాళికాంబ చంద్రశేర స్వామిఆలయంలో ఈవో లక్ష్మీనారాయణ, టెక్క నాగులకట్టల, గోపాలనగర్ ఆంజనేయస్వామిదేవాలయంలో కాలనీ భక్తుల ఆధ్వర్యంలో, చిన్మయ మిషన్ విద్యాలయంలో ధర్మజాగరణ సమితి ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామికి పంచామృత అభిషేకం, సింధూర అర్చన, పల్లకిసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేకంగా ఆకుపూజలు నిర్వహించి వడలచే ప్రత్యేక అలంకారంగా అలంకరించారు. అనంతరం మహామంగళహారతి నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు. కార్యక్రమంలో భగవత్ సేవాసమాజ్ కమిటీ అధ్యక్షుడు సముద్రాల సూరయ్య, కమిటీ సభ్యులు పార్థసారధికృష్ణ, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

శ్రీశైలం: శ్రీశైలం మహాక్షేత్రంలో శనివారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని పాతాళగంగ మార్గంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రసన్నాంజనేయస్వామికి విశేష పూజాదికాలు నిర్వహించారు. లోకకల్యాణం కోసం జరిపిన ఈ ఊజలలో ముందుగా దేశం శాంతి సౌభాగ్యాలతో విరిసిల్లాలని అర్చకస్వాములు సంకల్పం పఠించారు. అనంతరం మహాగణపతికి పూజలు జరిపి ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, జలాభిషేకం జరిపారు. తరువాత స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తరపూజ, నాగవల్లి దళపూజ(ఆకుపూజ), వడమాల సమర్పణ, పుష్పార్చన చేశారు. ఆలయ ఈవో డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

మహానంది: హనుమజ్జయంతిని పురష్కరించుకొని మహానందిలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ ఈవో కాపు చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు వైభవంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయంలో ఉదయం వేదపండితులు రవిశంకర్ అవధాని, ప్రధాన అర్చకులు అర్జునశర్మతో పాటు ఆలయ అర్చకులు మణికంఠశర్మలు విశేష అభిషేకము, ప్రాతఃకాల అర్చన అనంతరం సింధూరాలంకరం చేసి తమలపాకులతో సహస్రార్చనలను భక్తి శ్రద్ధలతో జరిపారు. ఈసందర్భంగా వడల మాలతోపాటు పూల అలంకరణతో ఆంజనేయస్వామి విగ్రహాన్ని తీర్చిదిద్దారు. భక్తులను ఈ అలంకరణ ఎంతో ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు ఈవో చేతుల మీదుగా ప్రసాదం పంపిణీ చెయ్యించారు. అలాగే మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్ సమీపంలోని ఆంజనేయస్వామి విగ్రహాన్ని ప్రత్యేక సింధూరంతో అలంకరించి భక్తులకు ధర్శనం ఏర్పాటు చేసారు. అర్చకుల పూజల అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

వెలుగోడు: వెలుగోడు పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో హనుమజ్జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గండి పేటలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో అభయాంజనేయ స్వామి భారి విగ్రహానికి భక్తులు పూజలు నిర్వహించారు.స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేసి సుందరకాండ పారాయణంతో హోమం నిర్వహించారు. భక్తులు భారిగా తరలి వచ్చి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

బండిఆత్మకూరు: మండలంలోని పెద్దదేవళా పురం గ్రామ శివారులో వెలసిన ఏకశిలా అభయాంజనేయ స్వామికి భక్తి శ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. శనివారం హనుమాన్ జయంతిని పురష్కరించుకుని నిర్వహకులు శివరాజునాయక్, నాగేశ్వరరావు నాయక్‌ల ఆధ్వర్యంలో తెల్లవారు జామునే స్వామికి అర్చనలు, అభిషేకాలు, ఆకుపూజలు చేశారు. అంతరం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. తేజనాయక్, శివనాయక్, వెంకటరమణనాయక్, శివన్న, రామిరెడ్డి పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరులో హనుమజ్జయంతి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. ప్రత్యేకించి పాతబస్టాండ్ సమీపంలో గల ఆత్మలింగేశ్వరస్వామి ఆలయం వద్ద వెలసిన అభయాంజనేయ స్వామి, కిషన్‌సింగ్‌వీధిలోని ధ్యాన ఆంజనేయ స్వామి, తోటగేరిలోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో స్వామికి ప్రాతఃకాల సమయం నుంచే అభిషేకాలు, అర్చనలు తదితర పూజా క్రతువులను శాస్త్రోక్తంగా చేపట్టారు. అలాగే ఆంజనేయస్వామికి తమలపాకులు, వడమాలలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అదేవిధంగా లోకకల్యాణార్థం హోమాలు చేశారు. కాగా వేడుకలకు విచ్చేసిన భక్తులకు తోటగేరి, కిషన్‌సింగ్ వీధుల్లోని ఆంజనేయ స్వామి ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కాగా పాతబస్టాండ్‌లోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం రాత్రి కూడా విశేష పూజలు నిర్వహించారు. స్వామివారికి దశ హారతులను నివేదించారు. ఈ వేడుకకు విచ్చేసిన భక్తులకు రాత్రి అల్పాహార వితరణ చేపట్టారు. ఇదిలావుంటే నల్లకాల్వ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద వెలసిన ఆంజనేయస్వామికి కూడా అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు.

ఆత్మకూరు రూరల్: ఆత్మకూరు మండలంలోని ఆయా గ్రామాలలో హనుమజ్జయంతి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీపతిరావు పేట గ్రామ శివార్లలో వెలసిన పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమ జయంతి సందర్భంగా ఆలయ పురోహితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం మూల విరాట్‌కు అభిషేకాది క్రతువులు నిర్వహించి, ప్రత్యేక అలంకరణ గావించి, కుంకు మార్చన పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు సమర్పించిన ఆకులతో ఆకు పూజ నిర్వహించారు. హనుమజ్జయంతి వేడుకలను పురస్కరించుకుని చుట్టుపక్కల గ్రామాల నుంచి ఈ ఆలయానికి భక్తులు తరలి వచ్చి ఆయా కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విచ్చేసిన భక్తాదులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నందికొట్కూరు: హనుమజ్జయంతి సందర్భంగా నియోజకవర్గంలోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో పూజలు నిర్వహించారు. శనివారం పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి గిత్తా జయసూర్య మారుతీ నగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమజ్జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, ఎల్లయ్య, మహేశ్వర్‌రెడ్డి, ఆచారి భరత్, బ్రహ్మానందరెడ్డి, రమణారెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని ఎర్రగూడూరు గ్రామ శివార్లలోని సంజీవ అభయ ఆంజనేయ స్వామిదేవి ఆలయంలో హనుమజ్జయంతి సందర్భంగా ఆలయ పురోహితులు జ్వాలముఖి రాఘవశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం స్వామికి పంచామృతాభిషేకాలు, ఆకుపూజలు, అర్చనలు నిర్వహించారు. స్వామిని వివిధ రకాలు పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గ్రామస్తులే కాక చుట్టు పక్కల గ్రామాల నుంచి విచ్చేసి స్వామివారిని పెద్ద ఎత్తున దర్శించుకొన్నారు భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందచేశారు. సాయంత్రం పలకీ సేవ నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మిడుతూరు: మండలంలోని రోళ్లపాడు, పీరుసాహెబ్ పేట, మిడుతూరు, చెరుకుచెర్ల, తలముడిపి, కడుమూరు తదితర గ్రామాల్లో హనుమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. పీరుసాహెబ్ పేట గ్రామంలో ఇస్కాన్ ధర్మ ప్రచారకులు రఘునందన్ సేవక్ దాస్‌జీ ఆధ్వర్యంలో హనుమంతుడికి పంచామృతాభిషేకం, ఆకుపూజ, హనుమాన్‌చాలిసా పారాయణం, సామూహిక కుంకుమార్చన, గోపూజ, నగర సంకీర్తన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచారకులు జయదేవానంద స్వామి, మల్లు వెంకట రెడ్డి, గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని కనకయ్యకొట్టాల, పారుమంచాల, మండ్లెం, 80బన్నూరు, జూపాడుబంగ్లాలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఆకుపూజ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కనకయ్యకొట్టాల గ్రామంలో సాయంత్రం ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

కొత్తపల్లి: మండలంలోని పెద్దగుమ్మడాపురం, కొత్తపల్లి గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో గ్రామస్థుల ఆధ్వర్యంలో హనుమజ్జయంతి వేడుకలు ఘనంగా జరుపుకొన్నారు. శనివారం కొత్తపల్లిలోని ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు అర్చకులు సింధూరంతో అలంకరించి క్షీరాభిషేకం, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించారు. అలాగే మహిళలు ఆంజనేయ స్వామికి కాయకర్పూరాలు సమర్పించి తీర్థప్రసాదాలు అందించారు. పెద్దగుమ్మడాపురంలోని సరస్వతి నారాయణ స్వామి ఆశ్రమంలో ఆంజనేయస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. గ్రామస్థుల సహకారంతో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.


ఎర్రగూడూరు గ్రామంలో..


ఆత్మకూరు రూరల్: ప్రత్యేక అలంకరణలో పంచముఖి ఆంజనేయస్వామి


పెద్దదేవళాపురం ఏకశిలా అభయాంజనేయ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


మహానందిలో ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఈవో చంద్రశేఖర్‌రెడ్డి


ఆత్మకూరులోని కిషన్‌సింగ్ వీధిలో అన్నదానం


కనకయ్యకొట్టాల గ్రామంలో పూజలు చేస్తున్న భక్తులు


వెలుగోడులో హోమం నిర్వహిస్తున్న భక్తులు

ఏపీజీబీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



బ్లడ్ డొనేషన్ క్యాంపును ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు, వైద్య సిబ్బంది

నంద్యాల (కల్చరల్), జూన్ 1: ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ నంద్యాల ప్రాంతీయ కార్యాలయం ఏర్పడి 19 సంవత్సరాలైన సందర్భంగా అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బ్యాంక్ మేనేజర్ వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్యాంకు సాధించిన ప్రగతి గురించి వివరించారు. అనతరం బ్యాంక్ డిపాజిట్లు, రుణాలు, డిపాజిట్లపై వడ్డీ రేట్ల గురించి తెలిపారు. అనంతరం బ్యాంక్ అవతరణ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది, బ్యాంక్ సీనియర్ మేనేజర్ వంశీకృష్ణ, మోహన్‌రామక్రిష్ణ, రమేష్, ప్రాంతీయ కార్యాలయ సిబ్బంది నంద్యాల పరిసర బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ప్రక్రియలో అప్రమత్తంగా ఉండాలి: బుడ్డా


మాట్లాడుతున్న బుడ్డా రాజశేఖరరెడ్డి

ఆత్మకూరు, జూన్ 1: శ్రీశైలం నియోజకవర్గం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో టీడీపీ తరుపున ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడి సూచించారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయం నందు ఆ పార్టీ కౌంటింగ్ ఏజెంట్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల్లో నుంచి వచ్చిన స్పందన చూశాక కచ్చితంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఓట్ల లెక్కింపు రోజున వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడే ప్రమాదం ఉందని అన్నారు. అయినప్పటికీ టీడీపీ ఏజెంట్లు సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. ప్రత్యేకించి రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ ఉద్యోగులందరు దాదాపుగా వైసీపీకి వ్యతిరేకంగా ఉన్నట్లు తమకు తెలిసిందని, ఈ పరిస్థితుల్లో పోస్టల్ బ్యాలెట్ ఓట్లను చెల్లనివ్వకుండా చేసేందుకు వైసీపీ ఏజెంట్లు కుట్రపడే ప్రమాదం ఉందని గుర్తుచేశారు. ఆసమయంలో టీడీపీ ఏజెంట్లు ఉద్వేగానికి లోనవ్వకుండా సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. కాగా ఓట్ల లెక్కింపు వివరాలను ఎప్పటికప్పుడు పకడ్బందీగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీశైలం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త బన్నూరు రామలింగారెడ్డి, మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శాకమూరి గిరిరాజు, టీడీపీ మండల, పట్టణాధ్యక్షులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, నాయకులు కలీముల్లా, అబ్దుల్లాపురం బాషా తదితరులు ఉన్నారు.

అన్నదాన పథకానికి విరాళం

మహానంది, జూన్ 1: మహానంది క్షేత్రంలో భక్తుల కోసం దేవస్థానం అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి మండలంలోని గోపవరానికి చెందిన చెందిరెడ్డి నాగార్జునరెడ్డి, శివగౌరి దంపతులు శనివారం రూ.25 వేలు విరాళం అందచేసినట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. దాతలు ముందుగా ప్రధాన ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో ఈవోకు అందచేశారు. వీరికి అన్నదానం బాండుతో పాటు స్వామి వారి శాలువాతో సన్మానించి ప్రసాదాలు అందచేశారు.

ఆలయ భూములకు కౌలు వేలం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

పాములపాడు, జూన్ 1: పాములపాడులోని దేవదాయ భూములు కౌలు ఇవ్వడానికి దేవదాయశాఖ అధికారి వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం వేలం నిర్వహించారు. చౌడేశ్వరీదేవి ఆలయం ఆవరణలో గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవ, నాగలింగేశ్వర, చౌడేశ్వరీదేవికి చెందిన దాదాపు 63 ఎకరాల ఆలయ భూములు కౌలుకు వేలం నిర్వహించారు. ఐదువేల రూపాయలు డిపాజిట్ చెల్లించి రైతులు వేలం పాటల్లో పాల్గొన్నారు. ఈ వేలం పాటల్లో సుమారు రూ.6,87,000 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ అధికారులు, నారాయణ, రైతులు పాల్గొన్నారు.

రోగులకు అందుబాటులో ఉండాలి: డీఎంహెచ్‌వో


కొత్తపల్లి పీహెచ్‌సీలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి

కొత్తపల్లి, జూన్ 1: వైద్యాధికారులు, సిబ్బంది వైద్యశాలకు వచ్చే రోగులకు అన్ని వేళలా అందుబాటులో ఉండి సేవలు అందించాలని నంద్యాల జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా ప్రోగ్రాం మేనేజర్ డా.సునీత, డీఐవో ప్రసన్నలక్ష్మి, నోడల్ అధికారి శ్రీజతో కలిసి కొత్తపల్లి, గోకవరం పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా వైద్యాధికారి వెంకటరమణ రోజువారి ఓపీతో పాటు రికార్డులను పరిశీలించి నెలవారిగా వైద్యశాలలో ఎన్ని కాన్పులు జరుగుతున్నాయని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే నాలుగైదు రోజుల పాటు వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందు బాటులో ఉండాలన్నారు. అనంతరం ఎదురుపాడులో 104 ద్వారా అంది స్తున్న వైద్య శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్యాధికారులు మహ్మద్ భేగ్, దీపా నాగవేణి, విజయేంద్ర, జేబేదా భేగం, సీహెచ్‌వో బాలకృష్ణ, వైద్యసిబ్బంది ఉన్నారు.

మహిళపై దాడి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 1: నంద్యాల టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోన పద్మావతి నగర్‌లో హోటల్ నిర్వాహకురాలిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసి గాయ పరిచినట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పద్మావతి నగర్‌కు చెందిన పరమేశ్వరి అదే ఏరియాలో మహేష్ అనే వ్యక్తి కొంత స్థలాన్ని లీజుకు తీసుకుని టీ హోటల్ నిర్వహించేవారు. అదే హోటల్‌లో టిఫిన్ సెంటరు ఏర్పాటుకై పరమేశ్వరి మహేష్‌తో మాట్లాడి కొంత మొత్తంలో నగదును అడ్వాన్స్‌గా చెల్లించారు. నెలకు రూ 15 వేలు అద్దె చెల్లించే విధంగా ఇరువురు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇరువురికి వ్యాపారం సరిగా జరుగక పోవడం ఇద్దరు మధ్య మనస్పర్ధలు తలెత్తాయి. ఈ క్రమంలో శనివారం ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది ఈ నేపథ్యంలో పరమేశ్వరిపై మహేష్, మధు, మౌళాలమ్మ భౌతిక దాడికి పాల్పడి తీవ్రంగా గాయ పరిచారు. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

101 టెంకాయల సమర్పణ

ఆత్మకూరు, జూన్ 1: హనుమజ్జయంతిని పురస్కరించుకుని శ్రీశైలం అసెంబ్లీ ఎన్నికల టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డికి విజయం వరించాలని ఆకాంక్షిస్తూ నల్లకాల్వ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద వెలసిన బాల వీరాంజనేయ స్వామికి శనివారం టీడీపీ నాయకులు 101 టెంకాయలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు టీడీపీ మోహన్, అశోక్, రవీంద్రబాబు మాట్లాడుతూ ఇప్పటికే అనేక ఎగ్జిట్‌పోల్ ఫలితాల్లో రాష్ట్రంలో కూటమిదే ప్రభుత్వమని చెబుతున్నారని, శ్రీశైలంలో కూడా కూటమి విజయం సాధించాలని వారు మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు వెంకట్, పెద్దన్న తదితరులు ఉన్నారు.

పోలీసు కవాతు


కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఆత్మకూరు, జూన్ 1: సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని జూన్ 4వ తేదిన జరగనున్న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా శనివారం ఆత్మకూరు పట్టణంలోని గౌడ్‌సెంటర్‌లో పోలీసులు మాబు ఆపరేషన్- మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. శాంతిభద్రతలకు విఘాతం కలిగినప్పుడు అల్లరిమూకలను ఏవిధంగా అదుపు చేయాలన్న విషయాలను భద్రతాదళాలకు వివరించారు. అల్లరిమూకలను ఎలా తరిమికొట్టాలో, విధ్వంసానికి యత్నించేవారిని ఏవిధంగా అణచివేయాలి, వారిని ఎలా అదుపులోకి తీసుకోవాలి, గాయపడిన ఏవిధంగా రక్షించాలి, సామాన్యులకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన అంశాలను మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం అల్లరిమూకలపై పోలీసులు టియర్‌గ్యాస్, తుపాకీలతో ఫైరింగ్, వజ్రవాహనంతో ఫైరింగ్, లాఠీచార్జీ చేసే ప్రక్రియను ప్రదర్శించారు. అంతకుముందు నంద్యాల టర్నింగ్ నుంచి గౌడ్‌సెంటర్ వరకు పోలీసు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు అర్బన్, రూరల్ సీఐలు లక్ష్మీనారాయణ, నాగభూషణ్, నంద్యాల ఆర్ఎస్ఐ శ్రీనివాసులు, కొత్తపల్లి, వెలుగోడు ఎస్ఐలు హరిప్రసాద్, భూపాలుడు ఉన్నారు.

ఓంకారంలో డీడీటీ పిచికారీ

బండిఆత్మకూరు, జూన్ 1: నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకార క్షేత్రంలో వైద్య సిబ్బంది డీడీటీ పిచికారీ చేశారు. శనివారం నారాయణాపురం గిరిజన పీహెచ్‌సీ ఆధ్వర్యంలో డాక్టర్ దినేష్‌బాబు, జిల్లా సహాయ మలేరియా అధికారి నేతృత్వంలో దోమల నివారణకై డీడీటీ పిచికారి చేయించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని వారు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది సుబ్రహ్మణ్యం, శంకరాచారి, నాగవేణి, సువర్ణ పాల్గొన్నారు.

వర్మీ కంపోస్టు తయారీ పరిశీలన

బండిఆత్మకూరు, జూన్ 1: మండలంలోని ఏ కోడూరు, పార్నపల్లె గ్రామాల్లోని వర్మీ కంపోస్టు తయారీని ఈవోపీర్డీ శ్రీనివాసులు పరిశీలించారు. శనివారం ఆయన స్థానిక సర్పంచ్‌లు మన్నె జ్ఞానభరణం, షబ్బీర్‌ల ఆధ్వర్యంలో పరిశీలన గావించారు. గ్రీన్ అంబాసిడర్లు సేకరించిన తడి, పొడి చెత్తల ద్వారా వర్మీ కంపోస్టు ఎరువు తయారవుతోందని, జాగ్రత్తగా తయారు చేయాలని సిబ్బందికి సూచించారు. పీఎస్‌లు సుబ్బారావు, వెంకటరాముడు, కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

అలరించిన గోవిందుడి వేషధారణ


గోవిందుడి వేషధారణలో చిన్నారి

పాణ్యం, జూన్ 1: మద్దూరు గ్రామానికి చెందిన గణపం హర్షికకు తిరుమల తిరుపతి బ్రహ్మోత్సవాలలో అరుదైన అవకాశం లభించింది. గ్రామానికి చెందిన టీడీపీ మండల కన్వీనర్ గణపం జయరామిరెడ్డి కూతురు గణపం హర్షిక తన తల్లితో పాటు తిరుమల తిరుపతి గోవిందరాజస్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్నారు. శనివారం వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలలో భాగంగా వేషధారణ అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు.

'బుడగ జంగాల సమస్యలు పరిష్కరించాలి'


చంద్రబాబును కలిసిన తాటికొండ బుగ్గరాముడు

బండిఆత్మకూరు, జూన్ 1: రాష్ట్రంలోని బేడ, బుడగ జంగాల సమస్యలు పరిష్కరిం చాలని టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును బుడగ సంగాల సంఘం అధికార ప్రతినిధి తాటికొండ బుగ్గరాముడు కోరారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో చంద్రబాబుకు కలిశారు. ముందుగా పుష్పగుచ్ఛం అందజేసి, బేడ, బుడగజంగాలను ఎస్సీలో చేర్చాలని, ఎంతోకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన మూడునెలల్లో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో బుడ్డా రాజశేఖర్‌రెడ్డి గెలుపు ఖాయమని, టీడీపీ జెండా ఎగురవేస్తారన్నారు.

కౌంటింగ్ రోజు గ్రామాల్లో 144 సెక్షన్

జూపాడుబంగ్లా, జూన్ 1: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఈనెల 4న జరిగే కౌంటింగ్‌ను దృష్టిలో పెట్టుకుని అన్నీ గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో ఆరోజు విజయోత్సవ ర్యాలీలు చేపట్టకూడదన్నారు. గుంపులు గుంపులుగా ప్రజలు ఉండరాదని, లేకుంటే కఠినచర్యలు తీసుకుంటామని అన్నారు. ఎటు వంటి డీజేలు కానీ, బాణసంచా కాల్చినా చర్యలు తీసుకుంటామని అన్నారు. రాజీకీయపార్టీల నాయకులు, ప్రజలు ఈ నిబంధనలు పాటించాలని అన్నారు.

నేడు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

నంద్యాల రూరల్, జూన్ 1: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిబ కనబరిచిన విద్యార్థులకు బలిజ కాపు సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రతిభా పురస్కారాలు ఇవ్వనున్నట్లు బలిజ కాపు సేవా సమితి వ్యవస్థాకులు దండే దస్తగిరి శనివారం తెలిపారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం ఈకార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 70 మంది విద్యార్థులు ప్రతిభా పురసారలకు పేర్లు నమోదు చేసుకున్నట్లు అధ్యక్ష్యుడు కొప్పుల సుబ్బారెడ్డి తెలిపారు.

ఘనంగా హనుమజ్జయంతి

● భక్తులతో కిటకిటలాడిన ఆంజనేయస్వామి ఆలయాలు ● ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు ● భక్తులకు అన్నదానం



చాగలమర్రి పట్టాభిరామాలయంలో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు



రుద్రవరంలో ..



ప్యాపిలిలో ఆంజనేయ స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

నంద్యాల, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ ప్రాంతంలో శనివారం హనుమజ్జయంతిని ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని ప్రజలు ఆంజనేయ స్వామి దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. ఆళ్లగడ్డలోని ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

డోన్(రూరల్): పట్టణంతో పాటు పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఇందిరానగర్, పాతపేటలోని శ్రీరాముల దేవాలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయంతో పాటు డోన్ కొండపై వెలసిన అంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు స్వామివారికి ఆకుపూజలు, కుంకుమార్చన పూజలు జరిగాయి. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమాలు నిర్వాహకులు నిర్వహించారు.

● గుమ్మకొండ గ్రామం అభయాంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. డోన్ టీడీపీ కూటమి అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుమ్మకొండ గ్రామ టీడీపీ సర్పంచ్ దశరథరామిరెడ్డి, టీడీపీ నాయకులు అయనకు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, గ్రామ టీడీపీ సర్పంచ్ దశరథరామిరెడ్డి, జనసేన నాయకులు గడ్డం బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: పట్టణంలోని వెంగన్నబావి, మధ్యగేరిలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా భక్తిశ్రద్ధలతో జరుపుకఒన్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించి సాయంత్రం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

బేతంచెర్ల: మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పట్టణంలో ప్రజలు భక్తులు భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా భక్తులు నిర్వహించారు. శనివారం పట్టణంలోని గౌరీపేటలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో నంద్యాల రహదారిలోని పలకచింతమాను ఆంజనేయస్వామి, గాడుబావి ఆంజనేయస్వామి, కనుమ ఆంజనేయస్వామి, ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గౌరిపేటలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో భజన కృష్ణయ్య బృందం అఖండ హనుమాన్ చాలిసా పారాయణం గావించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని చింతలచెరువు, చాగలమర్రి గ్రామాల్లో శనివారం హనుమ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. చాగలమర్రి పట్టాభిరామాలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి తమలపాకులతో అభిషేకాలు, పూజలు చేశారు. చింతలచెరువు గ్రామంలో వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో సీతారాములు, అంజనేయస్వామి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగించారు.

రుద్రవరం: రుద్రవరం మండలంలో శనివారం వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. అన్నదానం చేశారు. రుద్రవరం, వాసాపురం, యల్లావత్తుల, ఎర్రగుడిదిన్నె చందలూరు, నక్కలదిన్నె, కొండమాయపల్లె, యల్లావత్తుల, ముత్తలూరు, నరసాపురం, మందలూరు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. రుద్రవరం ప్రతాపరుద్ర ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక అలంకారంలో భక్తులకు ఆంజనేయస్వామి దర్శనం ఇచ్చారు.



డోన్: అవులదొడ్డి కొండపై ఆలయంలో పూజలు చేస్తున్న కోట్ల

శిరివెళ్ల: హనుమజ్జయంతి వేడుకలను మండల ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. వెంకటాపురం గ్రామంలో కొలువైన నెట్టికంటి ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌ను పూలమాలతో శోభాయమానంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహానికి అభిషేకం, 108 కళశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం మంగళ వాయిద్యాలతో వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు.

ఉయ్యాలవాడ: మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకఒన్నారు. మండలంలోని ఆర్.జంబులదిన్నె మెట్ట వద్ద వెలసిన ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు కీర్తిలక్ష్మణస్వామి స్వామి వారికి అభిసేకం అలంకరణ చేశారు. ఉయ్యాలవాడలో అన్నదాన కార్యక్రమంల చేపట్టారు.

దొర్నిపాడు: మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దొర్నిపాడు, కొండాపురం, రామచంద్రాపురం, చాకరాజువేముల ఆలయాల్లో ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొండాపురం, దొర్నిపాడు ఆంజనేయస్వామి ఆలయాల్లో తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బనగానపల్లె: పట్టణంలో శనివారం హనుమజ్జయంతి వేడుకలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండ లోని బాలాంజనేయస్వామి ఆలయం, కొండపేటలోని అంజనేయస్వామి ఆలయం, పట్టణంలోని అంజనేయస్వామి ఆలయంలో, పలుకూరు అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకల సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు తరలివచ్చారు. పట్టణంలోని ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులకు ఉచిత అన్నదానం చేశారు.

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల పట్టణంలోని ఎస్సార్బీసీ కాలనీలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఎస్సార్బీసీ కాలనీ స్వామి నగర్‌కు చెందిన వారు గురు, రాముడు, గురప్ప పవన్, కంబగిరి ఆధ్వర్యంలో అన్నదాన భక్తులకు కార్యక్రమం నిర్వహించారు.

అవుకు: అవుకు మండలంలోని ప్రజలు హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా శనివారం జరుపుకొన్నారు. అవుకు పట్టణంలో సంజీవరాయుడు తోటలో వెలసిన హనుమాన్ ఆలయంలో నిర్వహకులు పంద్ల వాయునంద్ గౌడ్ ఆధ్వర్యంలో అర్చకులు స్వాముల వారికి పూజలు నిర్వహించారు. అలాగే రాజావీధి, మార్కెట్ వీధి, అమ్మవారిశాల వీధి, కొండ మీది వీధుల్లో వెలసిన ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వాముల వారిని దర్శించుకున్నారు. స్వామి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. సంజీవరాయుడు తోటలో వెలసిన హనుమాన్ ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కొలిమిగుండ్ల రూరల్: మండలంలోని వివిధ గ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. కోరుమానుపల్లె గుండం అంజనేయస్వామి వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. మీర్జాపురం, అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల, బెలుం, కల్వటాల, నందిపాడు, తిమ్మనాయినిపేట, హనుమంతుగుండం తదితర గ్రామాల్లోని అంజనేయస్వామి, రామాలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. మీర్జాపురం గ్రామంలో టీడీపీ నాయకులు పోరెడ్డి చిన్నపురెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. శ్రీసీతారాముల కళ్యాణం అనంతరం స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేక పల్లకీలో ఊరేగించారు.



కోవెలకుంట్ల: పూజలు చేస్తున్న భక్తులు



దొర్నిపాడు: పూజలందుకున్న ఆంజనేయ స్వామి



బనగానపల్లెలో..



బేతంచెర్ల: హనుమాన్ చాలీసా ఆలపిస్తున్న భజన బృందం సభ్యులు



మిర్జాపురంలో గ్రామోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు



అవుకులో...

పింఛన్ కోసం నిరీక్షణ



బ్యాంకు సేవా కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న పింఛన్‌దారులు

చాగలమర్రి, జూన్ 1: చాగలమర్రిలోని ఎస్‌బీఐ, ఏపీజీబీ బ్యాంకు సేవా కేంద్రాల వద్ద పింఛన్ కోసం శనివారం ఉదయం నుంచే లబ్ధిదారులు నిరీక్షించారు. బ్యాంకు వద్ద పడిగాపులు కాచారు. పింఛన్ సొమ్ము బ్యాంకులో నమోదు కాకపోవడంతో సేవా కేంద్రాల వద్ద నిరీక్షణ చేయాల్సి వచ్చింది. ఈ విషయం గురించి ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డిని వివరణ కోరగా దివ్యాంగులు, వృద్ధులకు కొందరికి ఇళ్ల వద్దనే పింఛన్ పంపిణీ చేసినట్లు తెలిపారు. బ్యాంకులో నగదు జమ కాకపోవడంతో కొంత జాప్యం జరిగిందని, తిరిగి యథావిధిగా పింఛన్ దారులకు పింఛన్ సొమ్ము పంపిణీ చేసినట్లు తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి: సుబ్బారెడ్డి



డోన్‌లో రక్తదానం చేస్తున్న తెలుగు యువత నాయకులు

డోన్, జూన్ 1: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యాలయంలో సుబ్బారెడ్డి జన్మదినం సందర్భంగా కేకేను కట్ చేశారు. అదే విధంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్డు పంపిణీ చేశారు. అనంతరం తెలుగు యువత ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో వైసీపీ పాలనకు ప్రజలు ముగింపు ఇస్తారని అన్నారు. నాయకులు సీఎం శ్రీనివాసులు, ధర్మవరం చిన్న నాగిరెడ్డి, ధర్మవరం గౌతమ్ రెడ్డి, భరత్ రెడ్డి, ప్రజా వైద్యశాల మల్లికార్జునప్రసాద్ రెడ్డి, యాపదిన్నె సర్పంచ్ రామిరెడ్డి, జయన్న యాదవ్, మధుసూదన్ రెడ్డి, చిన్నకాంత్, బీఎడ్ బాషా, తదిరులు పాల్గొన్నారు.

'వన్యప్రాణులకు నీటి సౌకర్యం'



నీటి ట్యాంకును పరిశీలిస్తున్న అటవీ అధికారులు

చాగలమర్రి, జూన్ 1: మండలంలోని డి.వనిపెంట సెక్షన్ పరిధిలో నీటి కోసం పర్క్యులేషన్ ట్యాంకులు ఏర్పాటు చేశామని రేంజర్ శ్రీపతినాయుడు, ఎఫ్‌వో శ్రీనివాసులు తెలిపారు. శనివారం నీటి ట్యాంకులను పరిశీలించారు. బోరు నుంచి ట్యాంకులోకి నీరు వచ్చేలా పైపులు ఏర్పాటు చేశామని చెప్పారు. నీటి ట్యాంకుల సమీపంలో 4 కెమెరా ట్రాప్స్ ఏర్పాటు చేశామన్నారు. వన్యప్రాణులు నిరంతరంగా ఆయా ట్యాంకుల వద్దకు వచ్చి నీరు తాగి వెళ్తుంటాయన్నారు. అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని అన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అడవిలోకి వెళ్లరాదని అన్నారు. ఎఫ్‌వోలు, ప్రొటెక్షన్ వాచర్లు ఉన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

చాగలమర్రి, జూన్ 1: చాగలమర్రి ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ వీరభద్రుడు అధ్యక్షతన సాదాసీదాగా నిర్వహించారు. పెద్దబోదనం గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని ఆ గ్రామ ఎంపీటీసీ నరసింహులు విద్యుత్ ఏఈ షాజహాన్‌ను కోరారు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాన్ని తొలగిస్తామని ఏఈ చెప్పారు. వేసవి కాలంలో నీటి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జగ్గయ్య పేర్కొన్నారు. పశువుల్లో వచ్చే గాలికుంటూ, గొర్రెల్లో వచ్చే చిటిక వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామని పశువైద్యులు సాయిబాబా తెలిపారు. ఆయా గ్రామాల అభివృద్ధి తీరు గురించి వివిధ శాఖల అధికారులు తెలియజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఆయా గ్రామాల అధికారులు, కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని, గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. అడవుల సంరక్షణ అందరి బాధ్యతని అటవీశాఖ అధికారి శ్రీనివాసులు అన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఆయా శాఖల అధికారులు హాజరు కాకపోవడంతో ఆ గ్రామాల్లో సమస్యలను అడిగే ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో సర్వసభ్య సమావేశం నామమాత్రంగా సాగింది. కార్యక్రమంలో ఏవో రంగనేతాజీ, వైద్యులు ఇమ్రాన్, పశువైద్యాధికారి దీపకుమారి, పీఆర్ ఏఈ కొండారెడ్డి, ఉపాధ్యక్షుడు ముల్లా రఫి, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

బేతంచెర్ల, జూన్ 1: మండలంలోని అంబాపురం గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల గడ్డివాములను గత రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో రెండు గడ్డివాములు దగ్ధమయ్యాయి. దీంతో సుమారు రూ.80వేల రైతులకు నష్టం వాటిలినట్లు రైతులు వాపోయారు. గ్రామానికి చెందిన అల్లూరు మద్దిలేటి, అల్లూరు గోపాల్ ఇద్దరు అన్నదమ్ములు. రెండు గడ్డివాములను కల్లంలో నిల్వ ఉంచుకున్నారు. గత రాత్రి 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో రెండు గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి. దీంతో పశుగ్రాసం కాలిపోవడంత పశుపోషణ భారమవతుందని రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు'

రుద్రవరం, జూన్ 1: ఎన్నికల కౌంటింగ్ రోజున అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ నిరంజన్‌రెడ్డి శనివారం హెచ్చరించారు. గామాల్లో 144 సెక్షన్ పోలీసుయాక్టు 30 అమలులో ఉందన్నారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

భక్తిశ్రద్ధలతో జియారత్

చాగలమర్రి, జూన్ 1: చాగలమర్రి గ్రామంలోని జమాల్‌వలి స్వామి ఉరుసు మహోత్సవం సందర్భంగా శనివారం జియారత్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లింలు అధిక సంఖ్యలో దర్గా వద్దకు తరలివెళ్లి ప్రత్యేక ఫాతేహాలు చేశారు. కార్యక్రమంలో దర్గా అధ్యక్షుడు మహబూబ్‌బాషా, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వంట నిర్వాహకులకు శిక్షణ

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 1: కొలిమిగుండ్ల మోడల్ స్కూల్‌లో మండల విద్యాధికారి అబ్దుల్‌కలాం ఆధ్వర్యంలో శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వంట ఏజెన్సీ మహిళలకు ఒక్కరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. మధ్యాహ్న భోజన పథకంలో ఏజెన్సీ వారు నిబంధనలు తప్పక పాటించాలని ఎండీఎం ఏజెన్సీస్ జిల్లా మానిటరింగ్ అధికారి అజ్మతుల్లా ఆదేశించారు. అజ్మతుల్లాతో పాటు, రిసోర్స్ పర్సన్, హెచ్ఎం సుంకన్న ఏజెన్సీలు పాటించాల్సిన పద్ధతులు, విద్యార్థులకు భోజన పంపిణీ విధానం, ప్రభుత్వ నిబంధనలు తదితర అనేక అంశాలపై వారికి వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో కార్యాలయ సిబ్బంది కాంతారావు, జయలక్ష్మి, సీఆర్పీ మద్దిలేటి, నూర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచటంలో వంట నిర్వాహకులు కూడా భాగస్వాములు అవ్వాలని బోడెమ్మనూరు గ్రామ హైస్కూల్ హెచ్ఎం చంద్రశేఖరయ్య తెలిపారు. శనివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆయా గ్రామాల వంట నిర్వాకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల సీఆర్పీలు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు మంజూరు

చాగలమర్రి, జూన్ 1: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మొదటి విడత 6,200 పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు 31వేలు మంజూరయ్యాయని ఎంఈవో అనూరాధ తెలిపారు. శనివారం చాగలమర్రి ఎమ్మార్సీ కేంద్రంలో నిల్వ ఉన్న పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ 1వ తరగతి 2,468, రెండో తరగతి 2,546, ఆరో తరగతి 1,174, ఉర్దూ మీడియం 63 పాఠ్య పుస్తకాలు మంజూరయ్యాయని అన్నారు. ఎంఈవో న్యామతుల్ల, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఆసుపత్రి వివాదంపై అధికారుల ఆరా

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 1: కొలిమిగుండ్లలో వైద్యం వికటించి వ్యక్తి మృతి చెందారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న లైట్ ఎంఆర్ ఆసుపత్రిపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆరాతీశారు. శనివారం జిల్లా అధికారుల ఆదేశాలమేరకు స్థానిక వైద్యులు ఎల్ఎంఆర్ ఆసుపత్రిని సందర్శించారు. జరిగిన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకోవడంతో పాటు, ఆసుపత్రికి సంబంధించి వివిధ రకాల అనుమతి పత్రాలు పరిశీలించారు. తమ పరిశీలనలో వెల్లడైన విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి నివేదించనున్నట్లు స్థానిక ప్రభుత్వ వైద్యులు హరిచరణ్‌రెడ్డి పేర్కొన్నారు.

అనాథకు అంత్యక్రియలు

బేతంచెర్ల, జూన్ 1: పట్టణంలోని సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న హనుమాన్‌నగర్‌కు వెళ్లే రైల్వేబ్రిడ్జికింద గుర్తు తెలియని 50 ఏళ్ల వ్యక్తి శనివారం మృతి చెందారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు దర్యాప్తు చేసి అనాథ అని మృతునికి అంత్యక్రియలు నిర్వహించాలని ఆ నలుగురు స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు వన్నూరు బాషాకు కోరారు. దీంతో ఆయన తమ సంస్థ బృందంతో కలిసి మృతునికి బేతంచెర్ల శ్మశానంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో నాగేశ్వరరెడ్డి, లక్ష్మీరాఘవ, యూసఫ్, అక్బర్, మహేష్, మాబాషా పాల్గొన్నారు.

కూటమికే ప్రజలు పట్టం: కోట్ల



మాట్లాడుతున్న కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

ప్యాపిలి, జూన్ 1: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు టీడీపీ కూటమికే పట్టం కట్టనున్నట్లు డోన్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఆయన పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో సమావేశాన్ని నిర్వహించారు. కోట్ల మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు విసుగు చెందిన ప్రజలు చంద్రబాబుకు పట్టం కడుతున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని వర్గాలకు న్యాయం చేస్తామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, టీ.శ్రీనివాసులు, గండికోట రామ సుబ్బయ్య, రాజా నారాయణమూర్తి, రామ్మోహన్ యాదవ్, ఆలేబాదు పరమేష్, సీమ సుధాకర్ రెడ్డి, ఆర్ఈ నాగరాజు, చల్లా వీరాంజనేయులు, బత్తుల రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

డోన్: ఎగ్జిట్ పోల్స్ సర్వే సంస్థలు విడుదల చేసిన ఫలితాల్లో టీడీపీ కూటమిదే విజయం అని తేలిపోయిందని కేంద్ర మాజీ మంత్రి, టీడీపీ కూటమి డోన్ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని ఆవులదొడ్డి గ్రామంలోని కొండపై వెలసిన లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో కోట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని, డోన్‌లో టీడీపీ గెలవాలని పూజలు చేశారు. కోట్ల మాట్లాడుతూ వైసీపీ వ్యతిరేక విదానాలకు ప్రజలు తీర్పు ఇవ్వబోతున్నారని ఎగ్జిట్ పోల్స్ ఫలితాల్లో వెల్లడైందన్నారు. మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ సర్వే సంస్థలు టీడీపీ కూటమిదే అధికారం అని తేల్చాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామక్రిష్ణ, డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ లక్ష్మిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ టీఈ కేశన్నగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, జగదుర్తి ప్రతాప్‌రెడ్డి, సీమ సుధాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్ పాల్గొన్నారు.

'ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోండి'

డోన్(రూరల్), జూన్ 1: ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో మొదటి విడత ప్రవేశం కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 10వ తేదీలోపు తప్పనిసరిగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



వేంకటేశ్వర స్వామికి పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం, జూన్ 1: మండలంలోని వాసాపురంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి, లక్ష్మీగోదాదేవి అమ్మవార్లకు శనివారం అభిషేకం అర్చకులు వారణాసి గోపిశర్మ నిర్వహించి పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవారిని దర్శించుకున్నారు.

కమనీయం.. కంబగిరి స్వామి కల్యాణం



స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సంజామల, జూన్ 1: పేరుసోముల విష్ణుకంటి క్షేత్రంలో కొలువైన కంబగిరి లక్ష్మీనరసింహస్వామి కల్యాణం కమనీయం, కన్నుల పండుగలా జరిగింది. క్షేత్రంలో రెండు రోజుల పాటు సిద్ధలక్ష్మి, భూలక్ష్మి సమేతుడైన స్వామి వారికి మూడురోజుల పాటు తిరునాళ్ల నిర్వహించి విశేష పూజలు అందించారు. శనివారం ఉదయం , స్వామివారిని, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అహోబిలం క్షేత్ర ప్రధాన అర్చకులు వేణుగోపాల చార్యులు , రామ్మోహన్‌స్వామి, లక్ష్మీచెన్నకేశవ స్వామి ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు స్వామి కల్యాణాన్ని జరిపించారు. స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నందికొట్కూరు టీడీపీ అభ్యర్థి జయసూర్య, మాజీ ఎమ్మెల్సీ చెంగల రాయుడు తదితర ప్రముఖులు క్షేత్రాన్ని చేరుకొని స్వామి వారి కళ్యాణంలో పాల్గొన్నారు.